క్లుప్తంగా

బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి భారతి

గిద్దలూరు రూరల్: బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని జిల్లా జడ్జి ఏ.భారతి అన్నారు. మండలంలోని కృష్ణంశెట్టిపల్లె గ్రామ సమీపంలోని భీమలింగేశ్వరస్వామి దేవస్థానం సమీపంలో న్యాయ సేవా శిబిరం, నాల్స (గిరిజన హక్కుల పరిరక్షణ అమలు) అనే కార్యక్రమంపై స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా జడ్జి గిరిజన హక్కుల రక్షణ, వారికి అమలవుతున్న పథకాల గురించి వివరించి మాట్లాడారు. గిరిజనలకు షెడ్యూల్ తెగలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, పోలీస్‌శాఖ సేవలు, రెవెన్యూశాఖ అధికారుల నుంచి సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులు తదితర వాటి గురించి వివరించారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఎస్కే ఇబ్రహీం షరీఫ్ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ డైరెక్టర్ ఎస్.లక్ష్మారాయక్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

కొనకనమిట్ల: మండలంలోని చౌటపల్లి గ్రామంలోని ఎరువుల దుకాణాలను శనివారం మండల వ్యవసాయాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఏఓ శివనాగప్రసాద్, సీఐ రాఘవరావు పర్యవేక్షణలో గ్రామంలోని వెంకటసాయినాథ్, వెంకటేశ్వర ట్రేడర్స్ దుకాణాలను పరిశీలించారు. ఆయా షాపులలో రికార్డులు పరిశీలించారు. ఎరువులు, పురుగు మందులను, స్టాక్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎరువులు, పురుగు మందులు అమ్మినప్పుడు తప్పని సరిగా రసీదు ఇవ్వాలని ఏఓ దుకాణాదారులకు సూచించారు. రెండు దుకాణాలకు సంబంధించి రూ.2.80 లక్షలకు స్టాప్ సేల్స్ ఇచ్చారని ఏఓ ప్రకాష్‌రావు అన్నారు. షాపులకు సంబంధించి లైసెన్స్ డాక్యుమెంట్లు సక్రమంగా ఉండాలని, లేకపోతే జిల్లా అధికారుల సూచనల మేరకు షాపుల లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.

అంకాళమ్మ కొలుపుల్లో అన్నా ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాంబాబు

మార్కాపురం: పట్టణంలోని 9వ వార్డులో ఉన్న వీర్ల అంకాళమ్మతల్లి కొలుపులను శనివారం నిర్వహించారు. మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు కొలుపుల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు డాక్టర్ చప్పల్లి కనకదుర్గ, ఎం శ్రీనివాసులు నిర్వాహకులు పాల్గొన్నారు.

గ్యాస్ పొయ్యిల తనిఖీలు

పొదిలి: ప్రతి వినియోగదారుడికి సంబంధించిన గ్యాస్ సిలిండర్లు, పొయ్యిలు తనిఖీలు చేస్తారని స్థానిక ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఆయిల్ కంపెనీల ఆదేశాల మేరకు ఏజెన్సీ సిబ్బంది ప్రతి గ్రామం, ప్రతి ఇల్లూ తనిఖీలు చేసి అవసరమైన మార్పులు చేస్తారని తెలిపారు. గడువు ముగిసిన పైపులను తీసివేసి, ఆయిల్ కంపెనీ వారిచే ధ్రువీకరించపడిన సురక్ష పైపును స్పాట్‌లోనే మార్పు చేస్తారని తెలిపారు.

అడుగడుగునా పారిశుధ్య లోపం



పక్కన పడేసిన చెత్త సేకరణ రిక్షా



కాలువలో పేరుకుపోయిన మురుగు నీరు



రహదారి పక్కనే డంపింగ్ యార్డును తలపిస్తున్న దృశ్యం

కొమరోలు: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యం అత్యంత అధ్వానంగా ఉన్నాయి. రెడ్డిచెర్ల గ్రామంలో ఎక్కడ చూసినా మురికి కాల్వలు, వ్యర్థాలతో దర్శనమిస్తోంది. గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్య లోపం అడుగడుగునా కనిపిస్తోంది. గ్రామంలోని రేషన్ దుకాణం వద్ద మురుగు కాలువ మురికి నీటితో పొంగి పొర్లుతోంది. గ్రామపంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంతో గృహాల ముందు కాలువలపై ఉన్న బండలను తీసివేయడంతో కాలువలోని మురుగు దుర్వాసన వెదజల్లుతూ దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎస్సీ పాలెంలో పామూరుపల్లె రహదారి పక్కనే గ్రామంలోని చెత్తను తీసుకువచ్చి పడవేస్తుండడంతో ఆప్రాంతం డంపింగ్ యార్డును తలపిస్తుందని, దుర్వాసన వెదజల్లుతున్నదని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఎస్సీపాలెంలో సైడు కాలువలు లేకపోవడంతో రహదారులపై మురుగు ప్రవహిస్తుందన్నారు. చెత్తను సేకరించే గ్రామ పంచాయతీ రిక్షా ఉన్నప్పటికీ ఆ రిక్షాను కొన్ని నెలలుగా వినియోగించడం లేదు.

సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మండల స్పెషలాఫీసర్‌గా అర్జున్ నాయక్



అర్జున్‌నాయక్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

పొదిలి రూరల్: మండల స్పెషలాఫీసర్‌గా కే అర్జున్ నాయక్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. తనను స్పెలాఫీసర్‌గా నియమించడానికి సహకరించిన అందరికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం అర్జున్‌నాయక్‌ను మండల పరిషత్ సిబ్బంది శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శోభన్ బాబు, సీనియర్ అసిస్టెంట్ ఎన్ శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతల విషయంలో రాజీపడొద్దు

● జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

మార్కాపురం: శాంతి, భద్రతల విషయంలో.. మహిళా సమస్యల పరిష్కారంలో రాజీపడవద్దని ఎస్పీ దామోదర్ స్థానిక పోలీసు అధికారులకు సూచించారు. శనివారం ఆయన మార్కాపురం పట్టణ, రూరల్ పోలీసు స్టేషన్లను తనిఖీ చేసి సిబ్బందికి సూచలను ఇచ్చారు. పెండింగు కేసులపై నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. ఆయా స్టేషన్ల ఎస్సైలు తమ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బ్లాక్ స్పాట్‌లను గుర్తించి డేంజర్ బోర్డులను ఏర్పాటు చేయాలని, ప్రమాదాలు జరగకుండా వాహనాలకు రేడియం స్టిక్కర్లు అతికించుకునేలా రోడ్డు భద్రత నియమాలపై వివరించాలన్నారు. సైబర్ మోసాలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని తెలిపారు. ఇదే సమయంలో సిబ్బంది సంక్షేమంపై కూడా శ్రద్ధ పెట్టాలన్నారు. డ్రోన్‌లు ఉపయోగించి చట్టవ్యతిరేక కార్యకలాపాలను నియంత్రించాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో వృత్తిపట్ల నిబద్ధతతో వ్యవహరిస్తూ అంకిత భావంతో విధులు నిర్వర్తించాలన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. ట్రయల్ కేసులు, పెండింగు కేసుల్లో రికార్డులను చూడాలన్నారు. నేర పరిశోధనల్లో నిర్లక్ష్యం వద్దన్నారు. మహిళల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, గ్రామాలకు వెళ్లి ప్రజలతో కలిసి వారి సమస్యలు తెలుసుకుంటూ చట్టపరిధిలో పరిష్కారం చేయాలన్నారు. మార్కాపురం టౌన్‌లో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం లాకప్ రూములు, సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈయన వెంట డీఎస్పీ నాగరాజు, సీఐ సుబ్బారావు, పట్టణ రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమరావు తదితరులు ఉన్నారు.



ఎస్సై బ్రహ్మనాయుడుని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ దామోదర్

తర్లుపాడు పీఎస్‌ను తనిఖీచేసిన ఎస్పీ

తర్లుపాడు: మండల కేంద్రంలోని తర్లుపాడు పోలీసుస్టేషన్‌ను జిల్లా ఎస్పి ఏఆర్ దామోదర్ శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌లోని జనరల్ డైరీ, రికార్డుల నిర్వహణ, పరిసరాలను పరిశీలించారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా విచారించి నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలని ఎస్సై బ్రహ్మానాయుడుకి సూచించారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.

పొదిలి: దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించి వాటిని త్వరితగతిన పరిష్కారం చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. శనివారం రాత్రి కొనకనమిట్ల, పొదిలి పోలీస్ స్టేషన్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పొదిలి స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమకు ప్రత్యేక పూజలు చేశారు. లాకప్, ఉమెన్ హెల్ప్ డెస్క్, జీడీ,సీడీ ఫైల్స్, రికార్డుల నిర్వహణ, సీసీటీఎన్ఎస్‌లను పరిశీలించారు. స్టేషన్‌లలోని పరిసరాలను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ నేర నియంత్రణ, అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయాలన్నారు. గ్రామాలలో శాంతి భద్రతల సమస్యలు తల ఎత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. పిటి కేసులలో నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలన్నారు. ఏ కేసుల్లోనైనా పురోగతి కీలకమని, దర్యాప్తు ఆలస్యం కాకుండా పూర్తి చేయలన్నారు. సిసీ టీఎన్ఎస్‌లో ఎఫ్ఐఆర్ నుంచి చార్జిషీటు, కోర్టు డిస్పోజల్ వరకు ప్రతి ఫైల్ అప్‌డేట్ చేయాలన్నారు. పిల్లలు, మహిళలపై జరిగే నేరాల పట్ల ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో సదస్సులు ఏర్పాటు చేసి గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం మూలంగా కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట దర్శి డీఎస్పీ లక్ష్మీ నారాయణ, ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్ రాఘవేంద్ర, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు ప్రభాకరరెడ్డి, వేమన పాల్గొన్నారు.



పొదిలిలో వినాయకునికి పూజలు చేస్తున్న ఎస్పీ దామోదర్

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర

కొనకనమిట్ల: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యా పరిరక్షణకై తలపెట్టిన సైకిల్ యాత్ర శనివారం కొనకనమిట్ల చేరింది. యాత్ర బృందానికి కొనకనమిట్ల సీఐటీయూ మండల నాయకులు ఆరికట్ల శ్రీనివాసులు, పొదిలి ప్రాంతీయ కమిటీ కన్వీనర్ పిల్లి బాలనరసయ్య సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ విద్యా పరిరక్షణ సైకిల్ యాత్ర 100 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కనిగిరి నుంచి కొనకనమిట్ల వరకు సైకిల్ యాత్ర ప్రారంభించినట్లు ఆయన అన్నారు. విద్యా రంగ సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన చరిత్ర ప్రకాశం జిల్లా విద్యార్థి ఉద్యమానికి ఉందని, సంక్షేమ హాస్టల్ల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు ఎస్ఎఫ్ఐ నాయకత్వాన నిర్వహించారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు.

జిల్లా ఏకే యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ, మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలని ఆంజనేయులు డిమాండ్ చేశారు. యాత్రలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సీహెచ్ వినోద్, జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



కొనకనమిట్ల చేరిన సైకిల్ యాత్ర

వైభవంగా చెన్నకేశవుని శాంతి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



ప్రత్యేకాలంకారంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

మార్కాపురం టౌన్: శ్రీదేవీ భూదేవి సమేతుడైన లక్ష్మిచెన్నకేశవస్వామివారి శాంతి కల్యాణాన్ని శనివారం స్వామివారి మధ్యరంగ మండపంలో అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయ దేవేరులతో కలిసి స్వామివారిని వివిధ రకాల పూలలు, ఆభరణాలతో అలంకరించిన అనంతరం ఉభయదాతలు పట్టువస్త్రాలు సమర్పించగా ప్రధాన అర్చకులు అప్పనాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పట్టణంలోని కంభం రోడ్డులో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి సందర్భంగా ప్రత్యేక పూజలు అర్చకులు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారికి దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు భక్తులకు సౌకర్యాలను పర్యవేక్షించారు.

విశ్వాసపాత్రుడికి.. ఘన వీడ్కోలు

పొదిలి: ప్రస్తుత కాలంలో మానవ సంబంధాలు అడగంటుతున్నాయి. ఇంట్లో ఎవరైనా చనిపోతే బంధువులు కూడా సరిగా రాని పరిస్థితి. ఇక మూగజీవాలైతే పరిస్థితి దారుణం. విశ్వాసానికి పేరొందిన శునకం చనిపోతే ఓ వ్యక్తి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నాడు. మండలంలోని మాదాలవారిపాలెం గ్రామానికి చెందిన గుంటూరు శ్రీనివాసరెడ్డి అలియాస్ ముక్కు శ్రీను వ్యాపార రీత్యా పొదిలిలో నివాసం ఉంటాడు. శ్రీనివాసరెడ్డి మూగజీవాలకు సేవలు అందించేందుకుసిద్ధంగా ఉంటాడు. మూగజీవాలు ఏవైనా ఇబ్బంది పడుతూ తన కంట పడితే వెంటనే స్పందించి వైద్యం చేయించడం, మూగ జీవాలకు ఆకలి తీర్చడం అలవాటు చేసుకున్నాడు. శునకం మృత్యువాత పడితే దాని దహన సంస్కారాలు సంప్రదాయబద్ధంగా చేశాడు. మృతి చెందిన కుక్క కళేబరానికి స్నానం చేయించి, దానిపై కొత్త గుడ్డ కప్పి, అగరొత్తులు వెలిగించి, పూలు చల్లుకుంటూ నిర్జన ప్రదేశానికి తీసుకవెళ్లి గొయ్యి తీసి, కుక్కకు ఇష్టమైన బిస్కెట్లు, తినుబండారాలు గొయ్యిలో వేసి పూడ్చిం చాడు. మూగజీవాలు కూడా ప్రాణులేనని, వాటిలో కూడా జీవం ఉంటుందని, కొందరి మనుషులకు కూడా లేని విశ్వాసం కుక్కలకు ఉంటుందని వాటి బాధను, ఆనందాన్ని వ్యక్తం చేయలేవని మనమే గమనించి సేవలు చేయాలని చెప్తున్నాడు.



పాడె సిద్ధం చేస్తున్న శ్రీనివాసరెడ్డి

అనర్హులుగా 130 మంది పెన్షన్‌దారులు

అర్థవీడు: మండలంలోని 15 గ్రామ సచివాలయ పరిధిలో 130 మంది పింఛన్‌దారులకు పునఃపరిశీలనలో 40% కంటే తక్కువగా ఉన్న వారరిని అనర్హులుగా లిస్టు ప్రకటించారు. గతంలో 2010 నుంచి వస్తున్న పింఛన్‌దారులను కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తుందని మండల దివ్యాంగుల కమిటీ అధ్యక్షుడు పులి శ్రీను ప్రభుత్వాని ఘాటుగా విమర్శంచారు. ఈ రోజు శనివారం చివరి గడువు తేది 114 మంది పింఛన్‌దారులు అప్పీలు చేసుకున్నారని ఎంపీడీవో కే వీరరాజు తెలిపారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

మార్కాపురం టౌన్:

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. ఎస్సీ, బీసీ కాలనీలోని డ్వాక్రా బజారులోని వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ అక్షరాంధ్ర వలంటీర్ టీచర్లకు శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వయోజనులైన నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించి డిజిటల్ లిటరసీపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు రాందాస్ నాయక్, శర్వాణి, వయోజన విద్య సూపర్‌వైజరు చెన్నారెడ్డి, వెలుగు ఏపీఎం పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పనిసరి

మార్కాపురం: ఉద్యోగులకు పదవి విరమణ తప్పనిసరి అని ఎన్జీఓ సంఘం అధ్యక్షులు డాక్టర్ బీవీ శ్రీనివాసశాస్త్రి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త జి హరిహరరావు అన్నారు. వెలుగొండ ప్రాజెక్టులో డిప్యూటీ ఎమ్మార్వోగా బీవీ రమణ పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. శనివారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అటు అధికారులతో, ఇటు ప్రజలతో మన్ననలు పొందిన రమణ జీవితం అందరికీ ఆదర్శమన్నారు. రాయవరం హైస్కూల్‌లో టీచరుగా పనిచేసిన బీవీ రామారావు సన్మాన సభలో పలువురు హెచ్‌ఎంలు, ఎంఈఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పండిత పరిషత్ రాష్ట్ర నాయకులు రాష్ట్ర నాయకులు జియల్ రమేష్ బాబు, రిటైర్డు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత టీఎస్ జగన్నాథ్, యూటీఎఫ్ నాయకులు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రామారావు దంపతులను సన్మానిస్తున్న రమేష్, వీరారెడ్డి దంపతులు

జెడ్పీ పాఠశాలకు క్రీడా ప్రతిభా అవార్డు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జిల్లా స్థాయిలో క్రీడా ప్రతిభా అవార్డుకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఒంగోలులో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో హెచ్‌ఎం టీఆదినారాయణ, పూర్వ పాఠశాల పీడీ ఎం.బాలగురవయ్యను జిల్లా అధికారులు ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా హెచ్‌ఎం, పీడీ మాట్లాడుతూ గతంలో గొట్లగట్టు జెడ్పీ పాఠశాల క్రీడాకారులు ఆటల పోటీలలో పాల్గొని ప్రతిభ చాటారని, అందుకనుగుణంగా పాఠశాల జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఆమేరకు డీఈఓ కిరణ్ కుమార్ పర్యవేక్షణలో హెచ్‌ఎం, పీడీలను సన్మానించి క్రీడా ప్రతిభా అవార్డు అందజేశారు. ఈసందర్భంగా వారిని గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.



హెచ్‌ఎం, పీడీలను సన్మానిస్తున్న అధికారులు

విద్యార్థుల అభివృద్ధే ఉపాధ్యాయుల లక్ష్యం

కంభం: విద్యార్థుల సమగ్ర అభివృద్ధే ఉపాధ్యాయుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని మండల విద్యా శాఖాధికారి అబ్దుల్ సత్తార్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 2వ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు నూతన విషయాలను తెలుసుకోవడం ద్వారా క్లస్టర్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్లస్టర్ పరిధిలోని పాఠశాల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, సీ, డీ గ్రేడ్ విద్యార్థుల రెమెడియల్ శిక్షణ ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు, ఫార్మేటివ్-1 పరీక్షల మూల్యాంకనం, సిలబస్, డ్రాప్‌ఔట్ కారణాలు, తదితర అంశాల పై చర్చించారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో అబ్దుల్ సత్తార్



వైఎస్ జగన్ పాటలతో హోరెత్తిస్తున్న యువకులు



బేస్తవారిపేటలో ఉట్టికొడుతున్న యువకులు



మార్కాపురం: మట్టి వినాయకుడి వద్ద సందడి చేస్తున్న చిన్నారులు

వినాయకా.. వెళ్లిరావయ్యా !

బేస్తవారిపేట: వినాయక ఉత్సవాల్లో భాగంగా గత ఐదు రోజులుగా మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ట్రాక్టర్లపై వినాయక విగ్రహాలను డీజే, కనక తప్పెట్లు, డ్రమ్స్‌తో ఊరేగింపుగా కంభం చెరువు, కోనలకు తరలించారు. బేస్తవారిపేట రెడ్డినగర్‌లో గొంగటి రోజా రూ.50 వేలకు వేలంపాటలో దక్కించుకున్నారు. గణపతికి పూలమాలగా వేసిన రూ.10 నోట్ల దండను మిట్టా చంద్రశేఖరరెడ్డి రూ.25 వేలకు వేలం పాటలో దక్కించుకున్నారు. బేస్తవారిపేట బస్టాండ్ ఆవరణలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటలు, డీజేలతో, వైఎస్సార్ సీపీ జండాలతో హోరెత్తించారు.

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని నెహ్రూబజారులో వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహానికి శనివారం పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలునిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మార్కాపురం టౌన్: గణేష్ నవరాత్రుల్లో భాగంగా పట్టణంలోని కోనేటి బజారులో మట్టితో ఏర్పాటు చేసిన వినాయకునికి అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో విద్యార్థులు, మహిళలుపాల్గొని పూజలు నిర్వహించారు.



మార్కారపురం: పూజల్లో పాల్గొన్న మహిళలు